

కథా కౌముది

# మహాభినిష్క్రమణం

## శ్రీ చరణ్ మిత్ర



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

పలుచని వెలుగులో ఆ వార్డు గది మరింత భయంకరంగా తోస్తోంది శంకరానికి.

ఆసుపత్రి అంతా నిశ్శబ్దంగానే ఉన్నా తన మంచానికి నాలుగు మంచాల అవతల ఒక రోగి ఖళ్ ఖళ్ మంటూ దగ్గుతూ ఆయాస పడుతున్నాడు.

అతనలా దగ్గుతున్నా ఆ నర్సు ఎందుకో స్పందించడం లేదు.

ఈ రోగానికి ఆ దగ్గు కామన్ అన్నట్టుగా తనేదో ఆరోజు రోగుల ట్రీట్మెంట్ వివరాలు రాసుకుంటోంది.

ఆ దగ్గుతున్న వ్యక్తికి దగ్గరలోని మూడో మంచం, తన మీది పేషంట్ ను నిన్ననే స్మశానానికి పంపించేసి తెల్లని బెడ్ షీట్ కప్పుకొని అమాయకంగా ఎదురుచూస్తున్న కపట కసాయి లా ఉంది.

నిన్న ఇలాంటి సమయానికే..

ఆ వ్యక్తి మృత్యువుతో యాతన పడుతూ ఆక్సిజన్ సిలిండర్ పెట్టాక పోరాడి పోరాడి చనిపోయిన సమయం ఇదే.

ఆ సంఘటనే మాటి మాటికీ గుర్తుకు వచ్చి స్థిమితంగా నిద్ర పట్టడం లేదు శంకరానికి.

రేపు తన పరిస్థితీ అంతే కదా!

తన మంచం కిందనే తనకు సపర్యలు చేసి చేసి అలసిపోయిన తన భార్య పార్వతి ఆదమరిచి నిదురపోతోంది.

తను కూడా ఎక్కువ రోజులు బ్రతకడని వైద్యులు చెప్పేసారు.

మనిషి అన్నవాడు ఎవడూ బతకడు కానీ తను ఉండేది కొద్దిరోజులే అని తెలిశాక ఏవేవో కోరికలు పురుడు పోసుకుంటాయి.

ఇప్పుడు శంకరానిదీ అదే పరిస్థితి.....

ఆ దగ్గుతున్న వ్యక్తికి లాగానే తనకు కూడా డాక్టర్లు ఈ వారం రోజుల్లో ఎప్పుడైనా ప్రాణం పోవడానికి అవకాశం ఉందని చెప్పాక ....

కళ్లల్లో ఒత్తులు వేసుకుని గుడ్లనీరు కుక్కుకొని చూసే పార్వతిని చూసి శంకరానికి బాధ కలుగుతూనే ఉన్నా....,

నిస్సహాయంగా చూస్తూ, ఆమె చెంపల మీద కారుతున్న కన్నీళ్లను తుడవడానికి ప్రయత్నిస్తుంటాడు శంకరం.

సాధారణంగా ఈ ప్రభుత్వ హస్పిటల్స్ లో మధ్యతరగతి వారూ, దిగువ మధ్యతరగతివారూ నిరుపేదలే ఎక్కువగా జాయిన్ అవుతూంటారు.

వైద్య సిబ్బంది ఏదో తమ ప్రయత్నం చేస్తూనే..., ఏ వ్యక్తి ఎన్నాళ్ళు ఉంటాడో బంధువులకు తెలియజేస్తారు.

కంగారుపడిన రోగి సహాయకులు బంధువులకు, కుటుంబీకులకూ ఆ విషయం తెలియజేస్తారు.

అంతే....

అప్పట్నుంచి ఇన్నాళ్లుగా తాము ఎలా ఉన్నామో, లేమో అని చూడని వారంతా అలా చూడ్డానికి ప్రవాహంలా వచ్చేస్తుంటే.....

రోగికి అర్ధమయిపోతుంది తానిక బ్రతకనని.

మధ్యాహ్నం రోజు అంతా అలాంటి స్థితిని అనుభవించిన శంకరంకు 'ఇలాగే ప్రశాంతంగా తను చనిపోతే ఎంత ఆనందమో' అనుకున్నాడు.

తనను బ్రతికించడానికి ముక్కులో ఆక్సిజన్ గొట్టాలు వేస్తే ఊపిరి సులువవుతుందో, పోతుందో తెలియని దుస్థితిలో పోయే కంటే హాయిగా నిద్రలోనే పోతే ఎంత బాగుంటూందో....? అలాంటి ఏర్పాట్లు కూడా ఉన్నాయట. బహుశా ఆ ఏర్పాట్లు నిరుపేదలకు ఇవ్వరేమో?' అనుకున్నాడు మళ్ళీ.

అతను అలా ఏవేవో ఆలోచనలతో ఉండగానే తెల్లారింది.

మళ్ళీ మామూలే....

ఆయాలు బెడ్ షీట్లు సర్దడాలు,

స్వీపర్లు రూమ్ క్లీన్ చేయడాలు,

నర్సులు ఇంజక్షన్లు, మందులు ఇవ్వడాలు,

రొటీన్ గా జరిగిపోతున్నాయి.

ఇంతలో రాత్రంతా దగ్గుతూ ఆయాస పడిన వ్యక్తి నర్స్ ను, "నాకు ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారమ్మా!" అని అడిగాడు.

"డాక్టర్ గారు చెప్పాలి" అంది నర్సు.

"నాలుగు రోజుల నుంచి ఇదే మాట చెబుతున్నారు. నన్ను ఇక్కడే చంపేస్తారా?" అని పెద్దగా నర్సు మీద అరిచాడు.

"నన్నేం చేయమంటారు? డాక్టర్ గారు వస్తారు అడగండి. అక్కడ ఎవరూ నోరు ఎత్తరు. మమ్మల్ని ఇలా వేపుకు తింటారు" అంది విసుగ్గా.

ఒక వార్డ్ బాయ్ ఆ స్టాఫ్ నర్స్ కు సపోర్టు గా–

"చూడయ్యా.... డిశ్చార్జ్ రెండు రకాలుగా ఉంటాది. డాక్టర్లు సహజంగా చేసే డిశ్చార్జ్ ఒకటి.

రెండోది నీ బాడీ నుండి ప్రాణం డిశ్చార్జ్ అయిపోవడం ఎప్పుడో తెలిసిందనుకో.. రెండిట్లో ఏది కన్ఫర్మ్ గా తెలిసినా నీవే డిశ్చార్జ్ అయిపోయేలా చేస్తారు మా డాక్టర్లు" అన్నాడు పళ్ళికిలిస్తూ.

"మరే?" అంది నర్స్ కూడా నవ్వుతూ.

చిత్రంగా తోచింది శంకరానికి.

రోజూ నాలాంటి వాళ్లను కొన్ని వందల మందిని చూశాక వాళ్లకు ఈ రోగుల బాధలు అలవాటైపోయి వాళ్లకు నవ్వులాటగానే ఉంటుంది.

నిజమే.

రోగికి డిశ్చార్జ్ గురించి ఆలోచన ఉండడం సహజమే.

హాస్పటల్ నుండి ఇంటికి వెళ్లడం అనే గొప్ప ప్రక్రియకు అనుక్షణం ఆరాటపడేది అప్పుడే.

అనుకోకుండా తన్ను కొచ్చిన రోగం క్షణాల మీద మనిషిని ఆస్పత్రిలోకి తోసేస్తుంది

ఊహించని విధంగా బ్రతికించాలనే ఉపచర్యలు వైద్యులు చేసేస్తూనే ఉంటారు.

అన్ని సేవలూ సవ్యంగా జరుగుతూనే ఉన్నా ఇంటికి వెళ్లిపోవాలి అనే ఆరాటం రోగికీ, రోగి సహాయకులకీ ఎక్కువగా ఉంటుంది.

'వేళకు అన్నీ అమర్చిరోగిని ఎలాగైనా బాగు చేయాలి' అని మనం అనుకుంటాం కానీ......

'వీరిని తీసుకుపోవాలి' అని దృఢనిశ్చయంతో మృత్యువు నిలబడి ఉన్నప్పుడు...

రోగికి ఏర్పడుతున్న సంఘర్షణలో.......

రోగికి తన ప్రస్తుత పరిస్థితి కొంచెం కొంచెంగా అర్థమవుతుంది.

'నీకేం పరవాలేదు' అని ధైర్యం చెప్పే బంధువుల ధైర్య వచనాలు పెదాల మీద నుండి వస్తున్నా.....

వారి కళ్ళల్లో తనపై వ్యక్తమవుతున్న నిస్సహాయతను రోగి గ్రాహక శక్తి తేలిక గానే కనిపెట్టేయగలుగుతుంది.

'అలాగే!' అని బుర్ర ఊపిన రోగి....మనసులో

'ఓ హితుడా.....ఈ జన్మలో నిన్ను చూడటం ఇక ఇదే ఆఖరు కాబోలు? వెళ్తానంటున్నావా' అనుకుంటాడు.

పరిచయాలతో మొదలైన బంధాలు కలుస్తూ.., కలుస్తూ....,

కలిసినప్పుడు కళ్ళల్లో మెరుపులతో.....

వదనంలో కనిపించే ఆనందంతో....

తీయని మాటలతో ఆత్మీయతగా కొనసాగిన బంధాలు......

చివరిలో మాటమాత్రంగా పలకరించి వెళ్ళిపోతుంటే....

తిలక్ చెప్పినట్లు మహాలయ అమావాస్య ఎదురౌతున్నట్టుగానే ఉంటుంది.

అది ఆసుపత్రిలోనే ఎక్కువగా కనిపిస్తాయి.

ఇంటి వద్ద అయితే ఏకంగా పోయాక కలుద్దాం అనేవారు కొందరైతే---

'ఏమిటి చూస్తాం? చూసి తట్టుకోలేము కదా!' అని సాకులు చెప్తుంటారు కొందరు.

'ఎలాగూ చనిపోతాను అని తెలిసాక తను ఎందుకు ఆసుపత్రిలో ఉండడం? ఇంటిదగ్గర చనిపోతే మంచిది కదా' అనుకున్నాడు శంకరం.

ఆ విషయమే తర్వాత భార్యకు నెమ్మదిగా చెప్పాడు.

"వద్దు.... మీకు బాగు లేకుంటే..అక్కడెవరు చూస్తారు? ఇక్కడైతే ఏదోక ట్రీట్మెంట్ ఇస్తారు. ఇంటి దగ్గర మీకు సీరియస్ గా ఉంటే మిమ్మల్ని చూస్తూ నేను ఏడవాలి" అంది పార్వతి.

విరక్తిగా నవ్వాడు శంకరం.

"ట్రీట్ మెంట్ బతకడానికైనా, చావడానికైనా చేయాల్సిందేదో వారు చేస్తారు కానీ 'బ్రతకరు' అని తెలిసినప్పుడు వారు చేసే ట్రీట్ మెంట్ నామ మాత్రమే అయిపోతుంది పార్వతీ"

"ఇప్పుడు ఇంటికి వెళ్లి ఏం చేస్తారట?" అంది పార్వతి దుఃఖం గొంతులో అదుముకుంటూ.

"ఏం చేస్తాను? మన అదృష్టం కొద్దీ పిల్లలు లేరు.

నిన్ను ఒంటరి చేసి వెళ్ళిపోతున్న బాధ ఉన్నా .....

ఏ జన్మ బంధంతోనో నాకు తోడుగా నిలిచి ఇంత సేవ చేస్తున్న నా దేవతవైన నిన్నే చూస్తూ... చూస్తూ నా కన్నీటితో నీకు భాష్పాభిషేకం చేసుకుంటాను.

నా మదిలో మెదిలే ఆలోచనలను పిచ్చిపిచ్చి కవిత్వాలుగా రాసుకునే నా రైటింగ్ టేబుల్ మీద నేను రాసి వదిలేసిన కాగితాలను ఆప్యాయంగా చూసుకుంటాను.

అపర సరస్వతీ స్వరూపాలై నిశ్శబ్దంగా నా బుక్ ర్యాక్ లో కూర్చున్న పుస్తకాలను తనివి తీరా చేతితో స్పృశిస్తాను.

చదవకుండా వదిలేసిన చాలా పుస్తకాలకు క్షమాపణలు కూడా చెప్పాలి.

నన్ను ఎవరు పలకరించినా, పలకరించకపోయినా నాతో అంతరంగ సంభాషణను నడిపించిన నా రైటింగ్ ప్యాడ్ ను ఇక నిన్ను వదిలిపెడుతున్నానని చెప్పాలి" అంటూ చెబుతున్నప్పుడు అతని గొంతు ఆర్ద్రమయింది.

"ఆ దిక్కుమాలిన రాతలతోనే మీ ఆరోగ్యం ఇలా పాడు చేసుకున్నారు. ఆలోచనలు రావాలంటే సిగరెట్ తాగాలంటూ...ఆ పాడు ధూమపానం అలవాటు చేసుకుని గుండెను శిథిలం చేసుకున్నారు. జీవితాంతం నన్ను చూసుకుంటాను అని ప్రమాణం చేసారు. ఈ ఊరు కాని ఊర్లో ఇన్నాళ్లూ ఉన్నంతలో ఏ దిగులు లేకుండా బ్రతికిన మనల్ని ఈ రోగం విడదీస్తుందా? నేను మ్రొక్కే వెంకటేశ్వరుడు నాకు అన్యాయం చేయడు. నా మాంగల్యం గట్టిది" అంటూ పుస్తెలతాడుని కళ్ళకు తాకించి ఏదో తనకు ధైర్యం చెప్పడానికి చూస్తున్న భార్యను చూసి చిన్నగా నవ్వాడు శంకరం.

భర్త తన అమాయకత్వాన్ని పసిగట్టి నవ్వుతున్నాడని గ్రహించిన పార్వతి దుఃఖాన్ని దిగమింగి, "నిజమే చెప్తున్నానండీ!" అంటూ అతని భుజాన్ని చేతితో నిమురుతూ, చెంగుతో కన్నీటిని తుడుచుకుంది.

★ ★ ★ ★

"మగాళ్ళు ఎవరూ రావడం లేదామ్మా?" అంటూ డాక్టర్ పార్వతిని పక్కకు పిలిచి అడిగాడు.

"మాకు ఎవరూ లేరండీ" అంది పార్వతి సమాధానంగా.

"అలా అయితే కష్టమేనే!... ఆయన సంగతి మీకు నర్సులు చెప్పే ఉంటారు కదా..., వీలయినంత త్వరగా ఇంటికి తీసుకుపోతే మంచిది. ఇక రోజుల మనిషే... ఎప్పుడైనా ప్రాణం పోవచ్చు.." అంటూ మధ్యలో ఆపేసారు డాక్టర్ గారు.

"ఇక్కడ అయితే ఏదైనా చేస్తారు కదా సారూ!" పార్వతి ఆశగా అంది.

డాక్టర్ ఏమీ మాట్లాడలేనట్లుగా చూశాడు.

నర్సుని పిలిచి ఏదో చెప్పి వెళ్ళిపోయాడు.

నర్సు పార్వతి దగ్గరకు వచ్చింది.

"ఏం చేసినా ప్రాణం నిలపడం కష్టమేనంటున్నారు డాక్టరు గారు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగితే, ఒక్కదానివీ ఏం చేయగలవు?

"డెడ్ బాడీ రిపోర్టులకు, బాడీని బెడ్ మీది నుంచి దించడానికి వార్డ్ బాయ్ లకు డబ్బులు ఇవ్వాలి.. ఇక శవాన్ని ఇంటికి తీసుకు వెళ్ళడానికి అంబులెన్సులోనే తీసుకు వెళ్ళాలి. వాళ్లెంత డిమాండ్ చేస్తే అంత ఇవ్వాలి. బయట టాక్సీ తక్కువకొచ్చినా దానిని మాట్లాడుకోనివ్వరు. అందుకని బ్రతికున్నప్పుడే ఇంటికి తీసుకు వెళ్లడం బెటర్. డాక్టర్ తో డిశ్చార్జ్ రాయించుకుని ఇప్పుడే తీసుకు వెళ్ళండి." చెప్పింది నర్స్.

కళ్ళల్లో నీళ్లు చిప్పిల్లుతుండగా 'సరే' అన్నట్టుగా తల ఊపింది పార్వతి.

★ ★ ★

తమ ఇంటి వద్ద గుమిగూడి ఉన్న ఒక నలుగురైదురు వ్యక్తులను దూరంగానే ఆటోనుండి గమనించింది పార్వతి.

తమను ఆ మాత్రం అభిమానించేవారు ఉండడం ఆమెకి కాస్త ఆనందం అనిపించినా.... ,

ఆటో ఇంటి వద్ద ఆగగానే...,

"ఆగు!" అంటూ ఇంటి యజమాని అరుపులాటి కేక విని బిత్తరపోయి చూసింది.

"ఏంటి? ఈరోజో, రేపో చస్తాడని చెప్పినవాణ్ణి ఇంట్లోకి తీసుకువస్తున్నావు?" అన్నాడు ఇంటి ఓనరు కఠినంగా.

పార్వతి నిర్ఘాంత పోయింది.

"ఇప్పటి వరకు వున్న ఇంట్లో ఉండకూడదా?"

"ఇది మీ సొంతిల్లు కాదు, మీకు అద్దెకిచ్చిన మా ఇల్లు. రేపు ఇతను మా ఇంట్లో చస్తే ఆ తర్వాత ఎవరైనా ఈ ఇంట్లో దిగుతారా? ఇదేం పీనుగుల కొంప అనుకున్నావా? ఇక్కడ మీరు ఉండటం, కుదరదు" నిక్కచ్చిగా చెప్పాడు అతడు.

అనుకోని ఆ హఠాత్పరిణామాన్ని ఊహించని పార్వతి నివ్వెర పోయింది.

"అలా అనకండి బాబూ. అతను ఇంకా బతికే ఉన్నాడు కదా! బాధపడతాడు" అంది వణికే స్వరంతో.

"అతను బాధపడతాడని.., జీవితాంతం మమ్మల్ని బాధపడమంటావా? కష్టపడి కట్టించిన ఇల్లు.

పిల్లలు ఎవరూ లేరు. ఉండేది ఇద్దరే అని, ఇల్లు బాగా ఉంటుందని రెంట్ కు ఇచ్చాం. అంతే కానీ ఇప్పుడు ఏకంగా చావబోతున్న వాడిని ఈ కొంపలో పెడితే పూర్తిగా పాడుబడిన కొంప అయిపోదూ?" అంటూ ఏదేదో చెప్తున్నాడు.

ఆటోలో ఉన్న శంకరం నెమ్మదిగా ఏదో చెప్పబోతున్నాడు కానీ ఆ గందరగోళంలో ఏమీ వినపడటం లేదు.

"ఇలా అనడం ఏమైనా బాగుందా?ఇప్పుడు ఆయన్ని ఎక్కడికి తీసుకువెళ్ళగలను. మీరే చెప్పండి." అంటూ అడుగుతున్న పార్వతికి.....

"హాస్పిటల్లో పెట్టి, చస్తే అట్నుంచి అటే వల్లకాటికి తీసుకపోవాలి కానీ, ఇదేంటి? కొన ఊపిరితో ఉన్న వాడిని నిండు ఇంటిలో పెడతారా? అలా చేస్తే అరిష్టం కాదూ! ఇల్లు మైల పడుతుంది. శుద్ధి కర్మలన్నీ చేసుకునే కర్మ మాకెందుకు? పైగా ఎవరైనా ఏదైనా పుకారు పుట్టించారంటే, ఎవరూ అద్దెకు దిగరు" అంటూ ఇంటి ఓనర్ చెల్లెలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతోంది.

ఇంటి ఓనర్ల మాటలను సమర్థిస్తూ 'అవునవును' అన్నట్టుగా బుర్రలను కదిలిస్తున్నారు అంతా.

అందులో శంకరాన్ని 'బాబాయి గారూ!' అని పిలిచే వీరేశమున్నాడు.

'పార్వతక్కా' అంటూ రోజులో నాలుగు గంటలు తమ ఇంట్లో వుండి టీ తాగి కాని ఇంటికి వెళ్ళని శాంతకుమారి వుంది.

ఎంత మంది ఉన్నా వారిని ఉండమనే వారు ఎవరూ లేరు.

అంతెందుకు?

నిరుద్యోగంతో నీరస పడిపోయి, నిష్ప్రయోజకుడిలా పడి ఉన్న ఈ ఇంటి ఓనర్ కొడుకు సురేష్ కి....

తనను సన్మానించడానికి వచ్చిన కర్ణాటక ప్రైవేట్ ఫార్మసీ కంపెనీ ఓనర్ జయేష్ కు చెప్పి ఉద్యోగం ఇప్పించాడు శంకరం. ఇప్పుడు ఆ అబ్బాయి బెంగుళూర్ లో మంచి ఉన్నత స్థాయిలో వున్నాడు. మూడు వారాల క్రితం ఫోను చేసి చూడడానికి వస్తానని కూడా చెప్పాడు ఆ అబ్బాయి. ఎందుకో రాలేదు.

ఆ సురేష్ తల్లి దండ్రులే ఇపుడు తమను ఇంట్లో వద్దంటున్నారు. విషపురుగులకు విష పురుగులే పుడతాయి.

ఏ మాత్రం కృతజ్ఞత, మానవతా ఉండవు.

"అలాగంటే ఎలా బాబూ! ఈ చలిలో మేము ఎక్కడుండాలి?" అంది పార్వతి ప్రాధేయ పడుతున్నట్లుగా.

"మాకు తెలీదమ్మా! ఎవరైనా బంధువులు ఉంటే వాళ్ళింటికి వెళ్ళండి" అన్నాడు ఓనర్.

"ఇక్కడ మాకు ఎవరూ లేరయ్యా! పొట్ట పోసుకోవడానికి వచ్చినవాళ్లం. ఉన్న గూట్లోనే ఉండొద్దంటే ఎలాబాబూ? తొందరలో వేరే ఇల్లు చూసుకొని వెళ్లిపోతాం. ఇప్పుడు పేచీ పెట్టకండి" అందామె చేతులు జోడిస్తూ.

"మీకు ఇల్లు దొరికి వేరే ఇంటిలోకి మారే లోపల ఇతను ఇక్కడే చనిపోతే? డాక్టర్లు రోజుల మనిషని చెప్పారట. మాకు తెలియదనుకుంటున్నారేమో. ఆసుపత్రికి వచ్చిన వారు చెప్పారు. అలాటి వాణ్ని ఇంటిలో ఉంచుకుని, మైల పెట్టుకోలేము కదా? అయినా అదంతా మాకు అనవసరం. అతణ్ణి ఇక్కడ ఉంచడానికి వీల్లేదు. ఆటో! నువ్వు ఆటో స్టార్ట్ చేయవయ్యా. ఊర్లోకి శవాన్నే రానివ్వరు. నువ్వు చావబోతున్నవాణ్ణి యింట్లో పెట్టడానికి ఏకంగా బండేసుకొచ్చేసావు" అన్నాడు ఆటోవాడ్ని కసురుతూ.

"నాకేం తెలుసండి...ఇతని వెనుక ఇంత గొడవ ఉందని. ఆటో కావాలంటే నాలుగు రూపాయలు ఎక్కువ వస్తాయి అని బండి కట్టాను.... యింతకూ ఇతన్ని ఎక్కడ దించాలో చెప్పమ్మా!" అన్నాడు ఆటో వాడు చిరాకు పడుతూ.

"ఉండు బాబూ! నువ్వేం తొందరపడకు.. ఆయన ఇప్పుడు బాగానే ఉన్నారు కదా! వాళ్లని నేను బతిమిలాడుకుంటాను" అందామె ఆటోవాడ్ని అభ్యరిస్థూ.

"నీవు బ్రతిమిలాడినా, బామాలినా ఇక్కడ ఉండటం కుదరదమ్మా! మధ్యాహ్నమే ఇంటికి తాళం వేసేసాం. బయట కూడా ఉండడానికి వీల్లేదు. పిల్లలు భయపడతారు" అంటూ ఓనర్ చెల్లెలు మరింత కర్కశంగా చెప్పింది.

శూన్యంలో తను ఒక్కర్తే ఒంటరిగా నిలబడినట్లు అయింది పార్వతికి.

ప్రకాశవంతంగానే లైట్ల వెలుగులో వెలుగుతున్న ఆ వీధి మూఢ నమ్మకాల వాతావరణంలో మసక బారినట్లుగా అయింది.

"ఎక్కడకి తీసుకెళ్లాలో తొందరగా చెప్పమ్మా! అతని చూపు కూడా మారిపోయింది. ఏ క్షణంలో అయినా పోయేలా వున్నాడు. ఆటోలో ఇలాంటివి జరగకూడదు" అంటున్నాడు ఆటో వాడు.

"ఈ ఆటో వాడు ఈ ఇంటి ముందే దింపేసేటట్టు ఉన్నాడురా బాబూ!" అంటున్నాడు నిలబడిన వారిలో ఒకడు.

"అదెలా కుదురుతుంది? శవాన్ని వీధిలో పెట్టుకుని కూర్చుంటామా?" అని ఇంకెవరో అంటున్నారు.

"ఎక్కడ దింపమంటారు అమ్మా?" అని తొందరపెట్టి అడుగుతున్నాడు ఆటో వాడు.

"పార్వతీ...!" సన్నని గొంతుతో శంకరం పిలిచాడు. పార్వతి దగ్గరకు వెళ్ళింది.

"స్మశానానికి తీసుకు వెళ్ళమని చెప్పు." అన్నాడు పీలగా ఉన్న స్వరంతో.

ఆ మాట విని ఒక్కసారిగా బోరుమంది పార్వతి.

"నిన్న మొన్నటి వరకు ఉన్న ఇంటిలోకి, ఉన్నపళానా ఇలా తాళాలు వేసి మమ్మల్ని రానివ్వకపోవడం ఏమిటి భగవంతుడా?

చీకటి పడుతోంది. ఈ సమయంలో ఈ మనిషితో  ఎక్కడికి వెళ్లాలి? కొద్దిగా కనికరం చూపించండి బాబూ!" అంటూ అందరినీ వేడుకుంటోంది ఆమె.

కానీ.....

ధనదర్పం, అధికారం చలాయిస్తున్నప్పుడు మామూలు వ్యక్తులు నోరెత్తలేరు.

అక్కడ నాలుగైదు కుటుంబాలు వారి వద్దనే అద్దె యింట్లో ఉంటున్నారు కనుక  యజమానులకు కోపం  తెప్పించలేక  ఎవరూ నోరు విప్పడం లేదు.

పార్వతి బ్రతిమిలాడింది,

అరిచింది, ఏడ్చింది.

గొంతు చించుకొని కేకలు వేసింది.

అయినా  ఫలితం లేక పోయింది. ఆటోను స్మశానం వైపు మళ్ళించాడు డ్రైవర్.

★★ ★★

అస్తవ్యస్తంగా పిచ్చిపిచ్చిగా మొలిచిన రకరకాల మొక్కల మధ్య తృప్తి పొందని తమ తనువులను తనలో కలుపుకున్న భూమాతను కూడా ధనవంతులే బంధించినట్లుగా అక్కడ ఉన్నాయి కొన్ని పెద్ద సమాధులు. బతికున్నప్పుడు చాలామంది జాగాను తామే ఆక్రమించినట్టే చచ్చాక కూడా ఐదు, ఆరుగురు శవాలు పెట్టే అవకాశం ఉన్నగోతిలో ధనవంతుడు ఒక్కడే పడుకుని మరో శవానికి అవకాశం లేకుండా ఒక్కడే ఆక్రమించేసుకున్నట్టు పెద్దపెద్ద సిమెంట్ కట్టడాల సమాధులు కూడా అక్కడ ఉండి,

స్మశానం కూడా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ లాగే ఉంది.

ఆటో వాడు మొదట్లోనే వారిని దించేసి...,

పార్వతి వద్ద డబ్బులు కూడా తీసుకోకుండానే వెళ్లిపోయాడు.

నీరసంగా వెలుగుతున్న లైట్ వెలుగులో స్మశానం నిశ్శబ్దంగా ఉంది.

వ్యాధిగ్రస్తుడైన శంకరాన్ని వీధిలో కూడా ఉండనివ్వని గ్రామం కంటే ఆ స్మశానమే హుందాగా అనిపించింది పార్వతికి.

అయితే అడుగుపెట్టబోయే ముందే దైవాన్ని తలుచుకుంటూ శంకరాన్ని నెమ్మదిగా నడిపిస్తూ అక్కడికి దగ్గరలోనే ఉన్న చిన్న షెడ్ లాంటి దానిలోకి ఇద్దరూ ప్రవేశించారు.

కీచురాళ్ళ ధ్వని, గ్రామాన్ని భయపెట్టిన మూఢవిశ్వాసాల మనుషులకు మల్లే స్మశానం కూడా భయం పుట్టించేదిగా ఉంది.

ఉండుండి కాకులు, ఇతర పక్షుల సవ్వడీ, అరుపులు కంగారు కలిగించేటట్టుగా ఉంది.

కాస్త ఇబ్బందికరమైన వాసనగానే ఉన్నా కూర్చోవడానికి అనువుగా ఎవరో దాతలు పెట్టించిన సిమెంట్ కుర్చీ మీద హాస్పిటల్ నుంచి తెచ్చిన ప్లాస్టిక్ సంచీ లో బట్టలు, మందుల సంచులను అక్కడ పెట్టి కూర్చున్నారు ఇద్దరూ.

సంచీలో వాటర్ బాటిల్ తెరిచి నీరు తాగుతూ–

"ఒక్క మనిషి కూడా మన స్థితికి జాలి పడలేదు. మాటవరసకైనా రాత్రికి ఉండి వెళ్ళమనలేదు" అంటూ గొణుక్కోసాగింది పార్వతి.

"పిచ్చి పార్వతీ, వాళ్ళింట్లో చచ్చిపోతానేమో అని వాళ్ళ భయం. ఏం చేస్తాం? భగవంతుడు నాకు బ్రతికి ఉండగానే ఇక్కడికి డిశ్చార్జ్ చేశాడు" అంటూ పార్వతి తాగిన నీళ్ల బాటిల్ను అందుకొని తానూ కొంచెం నీళ్లు తాగాడు.

బెదురు చూపులతో స్మశానాన్ని అంతటినీ పరికించి చూస్తున్న పార్వతి కేసి చూస్తూ "భయమేస్తుందా పార్వతీ.. ఏ మనోకల్మషాలు లేని ప్రశాంతమైన చోటు ఇదే. ఇది నాదే అనుకునేవారు కానీ, ఇక్కడే ఉండాలి అనుకునేవారు కానీ ఇక్కడ వుండరు." అంటుండగా.......

ఒక ముగ్గురు వ్యక్తులు స్మశానంలోకి వస్తుండడం గమనించింది పార్వతి.

గుండెలు దడదడలాడాయి.

చేతిలో ఎర్రగా కాలుతున్న బీడీలు అస్తవ్యస్తంగా ఉన్న జుత్తులతో, అనాగరికంగా వేసుకున్న మాసిన బట్టలతో ఉన్న వారి దగ్గర నుండి భయంకర మద్యం వాసన గుప్పుమంటుంది.

ఏదో మత్తులో ఊగుతున్నట్టుగా వారి కదలికలు చీకట్లో సైతం స్పష్టంగా కనబడుతున్నాయి.

"ఓయ్ ఎవలాలు?" అన్నాడు ఒకడు వీళ్ళని ఉద్దేశించి.

"బాబూ మేము.. బాబూ" గొంతు తడబడుతుంటే.., భయంతో పలికింది పార్వతి.

"ఎవరైనా పోయింర్రా? మరి మీరే ఉన్నారేటి? శవం ఏది?" అన్నాడు వారిలో ఒకడు.

'శవం.. శవం..' అంటూ నసుగుతూ ఉంది పార్వతి.

"సర్లే..... ఈ మధ్యన బతికున్నోళ్లనే స్మశానంలో వదిలేసి వెళ్ళిపోతున్నారు. శవం ఎక్కడుంటే మాకేటిగానీ, ఇక్కడ మీ లాంటోళ్లు ఉండకూడదు. మేమంటే తాడూ, బొంగరం లేనోళ్ళం. ఇక్కడ గంజాయి కొట్టి మేమూ వెళ్ళిపోతాం. మీరూ బేగి వెళ్లిపోండి " అంటూ నడుస్తూనే చెప్పాడు ఒకడు.

తరువాత అక్కడ రాళ్ల మీద కూర్చుని గంజాయి పీలుస్తూ...ఏవేవో అసందర్భపు ప్రేలాపనలు పేలుకుంటూ ఓ గంట, గంటన్నర ఉండి, తరువాత వీరిని పట్టించుకోకుండానే వెళ్లి పోయారు వారు.

కాసేపటికి........

కాస్త మోటుగా ఉన్న వ్యక్తి తొమ్మిది గంటల వేళకు అక్కడకు వచ్చాడు.

"ఓయ్ ఎవరక్కడ? ఏటి చేస్తున్రు?" అంటూ అరుచుకొచ్చి నిలబడ్డాడు.

లేచి నిలుచుంది పార్వతి.

"ఎవరమ్మా! నువ్వు? ఇక్కడ నీకేంటి పని? నేను ఇక్కడ కాపరోడ్ని. ఇక్కడ నేనే ఉండను. మీరెవరో వచ్చినారని మా కుర్రోళ్ళు సెబితే వచ్చినాను."

కాటికాపరి నిజంగా బేతాళుడు లాగే ఉన్నాడు.

ఎన్నో శవాల్ని భూమిలో పూడ్చి, చితి మంటల్లో కాల్చి మనిషి రాటు దేలినట్లే ఉన్నాడు. దానికి తోడు కాస్త మత్తులో కూడా ఉన్నట్టున్నాడు.

విషయం అంతా చెప్పిన పార్వతితో.....

"ఓసి! నా పిచ్చితల్లీ.. సావబోయే మొగుడిని స్మశానంలో పెట్టడానికి ఈ రేతిరేళ ఇక్కడ ఉన్నావా? అప్పుడెప్పుడో హరిశ్చంద్రులోరి కథలో ఆయన భార్య రేతిరేళ వచ్చిందని ఇన్నాను. ఇప్పుడు నిన్ను సూత్తన్నాను. ఈయన ఎప్పుడు కనుమూత్తాడో తెలీదు కానీ రేతిరంతా ఇక్కడే ఉంటావేటి? చూడ్డానికి శిలపంలా ఉన్నావు. దొంగ నా కొడుకులు తిరిగే ఈ సోటులో ఈ సావుగొట్టోడుతో ఎలా ఉంటావు? ఈయన కన్ను మూసినాకైనా ఒక్కర్తివీ ఉండడం కష్టవేగా" అంటూ ముందుకు వచ్చాడు.

సిమెంట్ కుర్చీకి ఆనుకుని పడుకున్న శంకరం అతనికి రెండు చేతులూ జోడించి దండం పెట్టాడు.

'ఇక్కడి నుండి నువ్వు కూడా మమ్మల్ని వెళ్ళగొట్టొద్దు' అనే భావంతో.

"వద్దు బాబూ! ఈ ఎట్టోడికి దండం పెడతారేటి? కాకుంటే మీ పరిస్థితి పగోరికి కూడా రాకూడదు" అన్నాడు.

"దెయ్యాలు వుంటాయని భయపడుతోంది." పార్వతిని చూపిస్తూ అతనితో చెప్పాడు శంకరం.

ఆ వ్యక్తి పెద్దగా నవ్వాడు.

"దెయ్యాలు ఇక్కడ ఎందుకు ఉంటాయమ్మా? అవి ఊళ్ళల్లో మనుషుల మనసుల్లో దూరిపోయాయి. ఇక్కడ ఉండేది నాలాటోళ్లే.. అది సరే కానీ మీరు ఏమైనా తిన్నారా?" అని అడిగాడు ఆ కాటి కాపరి.

మధ్యాహ్నం నుండి ఆ ఒక్క మాట అడిగే వారు లేక, అతను అలా అడిగేసరికి ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది శంకరానికి.

మౌనంగా ఉండిపోయారు ఇద్దరూ. విషయం అర్థం చేసుకున్నాడు ఆ కాటికాపరి.

"బాబూ! నేను కాటికాపరోణ్ణి అనే భేదం లేకపోతే మా ఇంట్లో కూడుంది. తెస్తాను తింటారా?" అని అడిగాడు.

దానికి కూడా వారిరువురూ సమాధానం చెప్పలేదు.

"పోనీ.. ఈ రేతిరేళ ఇక్కడ ఉండటం ఎందుకు? ఈ సొశేనాన్ని అనుకునే నా గుడిసె కూడా ఉంది. మీరు అక్కడికి వచ్చేయండి. అక్కడే ఉందురు గానీ. కాకుంటే అది కూడా సొశేనంలో భాగమే. నేను ఉండడానికి అది ఒక ఆదరువు. అంతే!" అంటూ పడుకున్న శంకరానికి లేవమంటూ తన చేయి ఆసరా ఇచ్చిలేపాడు.

పార్వతి సంచిలో తన బట్టలను పట్టుకుంది, వెళ్లడానికి సిద్ధపడుతున్నట్టుగా.

నడుస్తూ...

"నీ పేరేమిటి బాబూ!" అని అడిగాడు శంకరం.

"భద్రయ్య అంటారండి. పదేళ్లుగా ఇక్కడే ఉంటన్నాను. మా ఆడది కూడా కళ్ళు మూసి రెండేళ్లయింది. నేనే సోయంగా దాణ్ణి ఇక్కడే పూడ్సి పెట్టాను. నా కొడుకు నన్ను వదిలేసి పెళ్ళాంతో వేరే ఇంటికి పోయాడు. నాతో సొశేనంలో ఉండడానికి కోడలు ఒప్పుకోలేదు. మా ఆడది ఉన్న ఈ సోటుని ఇడిసిపెట్టి నాకు ఇంకో సోటికి పోబుద్ధి కాలేదు. యెవరి ఇట్టాలు ఆళ్లవి. అయినా నాతో ఎవరుంటారులే బాబూ!" అంటూ ఒక గుడిసెలోకి దారి తీసాడు భద్రయ్య.

అందులో అడుగుపెడ్డానికి సంశయించింది పార్వతి.

"పరవాలేదమ్మా! నేను కాటికాపరోణ్ణే కానీ కసాయోణ్ణి కాదు. నువ్వు నా తోడబుట్టిందానివి అనుకో తల్లే. శవాలకంపు, సారా కంపుతో ఉన్న నా కాడికి ఎవరొత్తార్లే అని ఇన్నాళ్లూ అనుకునేవోడిని. కానీ పార్వతీ పరమేశరుల్లా మీరొచ్చారు. పెనివిటి అనే పరమేస్పని కోసం వల్లకాటికి కాపరానికొచ్చిన ఆ పార్వతమ్మలాగే ఉన్నావు. అది నాకు నచ్చింది. పెనివిటి పోతే గుమ్మం దగ్గర ఉండిపోయే ఆడోళ్ళనే నేను సూశాను. పెనిమిటి కోసం సొసేనానికి వచ్చిన నీవు పార్వతమ్మలానే ఉన్నావు రండమ్మా! నేను ఇక్కడే మా అప్పారావు టిపినీ కొట్లొ తినడానికి ఏమైనా ఉంటే తీసుకొస్తాను" అంటూ పరుగు పరుగున బయటకు వెళ్లి పావుగంటలోనే తిరిగి వచ్చాడు.

ఇద్దరికీ ప్లేటుల్లాంటివి శుభ్రంగా కడిగి వారికి పెడుతున్న అతని వైపు నిర్వికారంగా చూస్తున్నారు ఆ ఇద్దరు దంపతులూ.

"ఎప్పుడు తిన్నారో? ఏటో..., రండి.. తినండి" అంటూ గోడకు జారబడి కూర్చున్నాడు భద్రయ్య.

ఇద్దరూ నిశ్శబ్దంగా తింటున్నారు.

"భద్రయ్యా! ఎవరూ పట్టించుకోని మమ్మల్ని దేవుడిలా ఆదుకుంటున్నావు. ఆకలి తీరుస్తున్నావు. నీ రుణం ఎలా తీరుతుంది?" గద్గధ స్వరంతో శంకరం.

చిత్రంగా నవ్వేడు భద్రయ్య.

"మడుసుల్ని పూడ్చిపెట్టడం, తగలెట్టడంతోనే ఈ సేయికి ఎప్పుడూ గడిసిపోయేది. మాఇంటికి ఎవలు వచ్చి తింటారులే అనుకునేవాడిని. ఇతరులకు ఇంత కూడు పెట్టడమే పున్నెమైతే.. అది నాకు ఇప్పుడు మీ ఇద్దరి వల్లే వచ్చినాది. నేనే మీకు రుణపడిపోయాను బాబూ!" అన్నాడు భద్రయ్య చిత్రంగా నవ్వుతూ.

"నేను బాగుంటే నీ విషయాన్నే ఆధారంగా తీసుకుని ఓ కథ రాసుకునే వాడిని భద్రయ్యా! కానీ నాకా అదృష్టం లేదు. నేను ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ పొందాను. ఇంటి నుంచి నా అనుకునే నలుగురు మనుషుల సమక్షంలో భౌతిక డిశ్చార్జ్ పొందాలనుకున్నాను, అవలేదు. అయితే , ఒక మంచి మనసున్న ఇంటి నుండే డిశ్చార్జ్ అవుతున్నాననే ఆనందం ఇప్పుడిప్పుడే కలుగుతోంది. నేను కన్నుమూసే వరకూ నన్ను ఇక్కడే ఉంచి నీ చేతుల మీదే నన్ను సాగనంపెయ్ భద్రయ్యా! మా పార్వతికి ఏమీ తెలియదు. నా దగ్గర నాలుగువేల దాకా ఉన్నాయి. అవి తీసుకో. మా పార్వతిని ఆ ఇంటి దగ్గరకు పంపిస్తే చాలు. తను ఎలాగో బ్రతుకుతుంది." అంటూ డబ్బులు తీస్తూ ఉండగా.......

"వద్దు బాబూ! నేను డబ్బుల కోసం ఇదంతా సేయనేదు. సాటి మనుషుల్ని కష్ట సమయంలో ఆదుకున్న తృప్తి నాకు మిగిలింది. నాకు అది చాలు" అంటూ అక్కడ చాపలు పరిచి వారిని పడుకోమన్నాడు భద్రయ్య.

తాను బయట పడుకోవడానికి మరో చాప తీసుకున్నాడు.

"నేను ఆ పంచలో పడుకుంటాను బాబూ! నాకు అలవాటే. తెల్లారి మాట్లాడుకుందాం మరి" అంటూ బయటికి వెళ్లిపోయాడు.

అతని సంస్కారానికి చేతులెత్తి దండం పెట్టాలనిపించింది ఆ ఇద్దరికీ.

ఆ రాత్రి పది గంటల ప్రాంతంలో, "శంకరం గారూ! శంకరం గారూ! పార్వతమ్మా!" అంటూ ఎవరివో పిలుపులు వినిపించడంతో మేలుకునే ఉన్న పార్వతి, శంకరం ఎవరై వుంటారా? అని చూస్తుంటే, భద్రయ్య ఇద్దరు వ్యక్తులను వెంట పెట్టుకుని వచ్చాడు.

పార్వతి, శంకరం ఇద్దరూ ఆశ్చర్య పోయారు. ఇంటి యజమాని .. అతని కొడుకు సురేష్.

"శంకరం గారూ! మమ్మల్ని క్షమించండి. నేను మిమ్మల్ని చూడాలని రాత్రే వచ్చాను. తీరా చూస్తే జరిగిన ఘోరం చెప్పారు. మా అమ్మానాన్న మీ పట్ల చాలా నిర్దయగా ప్రవర్తించారు. మీరు నాకు ఉద్యోగం ఇప్పించారు. మీ వల్లే నేను ఈ స్థితిలో ఉన్నాను. ఒకరు కాకపోతే ఒకరైనా చేరదీయకుండా మిమ్మల్ని ఇలా స్మశానానికి

పంపించడమేంటి? మీరు వెంటనే ఇంటికి రావాలి. మీ కోసం టాక్సీ తీసుకు వచ్చాను. మీరు రాకపోతే మమ్మల్ని మేము ఎప్పటికి క్షమించుకోలేము. ప్లీజ్! అమ్మా! రండి." సురేష్ కన్నీరు కార్చడం ఒక్కటే తక్కువ.

"శంకరం గారూ! చాలా పొరపాటు చేశాను. కృతజ్ఞత లేకుండా ప్రవర్తించాను. సురేష్ కి కరోనా వచ్చి, అక్కడ ఒక్కడూ ఉండిపోయాడని మేము మీ ముందు బాధపడ్డాము. ఆ తర్వాత కొన్నాళ్ళకు వాడికి తగ్గి మామూలు మనిషయ్యాడు. వాడికి మీరు చేసిన సహాయం ఇప్పుడే చెప్పాడు. ఆ రోజు మీరు ఫోను చేసి ఆఫీసు మేనేజర్ కి చెప్పబట్టే వాళ్ళు డాక్టర్ ని ఇంటికి పంపించారట. అంతే కాదు. తగ్గేవరకూ కంటికి రెప్పలా చూసుకున్నారట. ఎవరో ముక్కూ ముఖం తెలియని వారు మీ మాటలతో నా బిడ్డను జాగ్రత్తగా చూసి కాపాడారు. అలాంటి మిమ్మల్ని నిర్ధాక్షిణ్యంగా ఇంట్లో నుండి తరిమాను. కనీసం స్మశానానికి వెళ్తాము అన్నప్పుడైనా నేను ఆలోచించి ఉండవలసింది. మీరు ఇంటికి వస్తేనే నా మనసు శాంతిస్తుంది... మమ్మల్ని క్షమించి రండి." ఇంటి యజమాని ప్రాధేయపడ్డాడు.

వారి కేసి నిర్వికారంగా చూసాడు శంకరం. 'వెళ్లి పోదామా 'అన్నట్టుగా చూస్తోంది పార్వతి.

'ఏమంటాడో?' అని శంకరం కేసి చూస్తున్నారు సురేష్, అతని తండ్రి సుదర్శనంలు.

భారంగా ఊపిరి పీల్చి సాలోచనగా కాసేపు భృకుటిని మూసి తెరిచిన శంకరం..

"స్మశానానికి చేరిన శవాన్ని మళ్ళీ ఊళ్లోకి, ఇంట్లోకి ఎవరైనా తీసుకు వెళతారా సురేషూ.... మళ్ళీ ఇక్కడికే కదా తీసుకురావాలి .. వద్దులే" అన్నాడు.

"ఇప్పటికి మీరు బాగానే ఉన్నారు కదండీ..ఈ స్మశానంలో ఎందుకు ఉండటం అని....." నీళ్లు నములుతున్నట్టుగా అన్నాడు సురేష్.

"నేను ఇప్పుడు స్మశానం లో లేను సురేష్... మానవత్వం చూపించే మనిషి ఇంట్లో ఉన్నాను. ఎక్కడ గడపాలో తెలియని స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదరించి, ఆకలి తీర్చిన మంచి మనిషి సన్నిధిలో ఉన్నాను.. ఆ వూళ్ళో, ఆ ఇళ్ల దగ్గర ఆ మానవత్వం మచ్చుకైనా కనిపించలేదు. నేనేదో గతంలో మీకు మేలు చేశాననే కృతజ్ఞత కొద్దీ, ప్రత్యుపకారం చేద్దామనుకుంటున్నారు అంతే.... కానీ ఈ భద్రయ్య కు నేను ఏమవుతానని ఆదరించాడు? మనిషిని మనిషిగా చూడని మనుషులు ఉన్న ఈ సమాజంలో...... మూఢ విశ్వాసాల మూర్ఖత్వాన్నే నాగరికత అనుకోలేక....., సాటి మనిషిని తనతోటి వాడే గ్రహించి, ఆదరించి సంస్కారాలు జరిపే ఈ భద్రయ్య దగ్గరే నేను చివరి శ్వాస విడవాలనుకుంటున్నాను. నేనిక ఎక్కడకూ రాను. నాకు రాచ మర్యాదలతో మీరు అంతిమ సంస్కారం జరిపించారని జయేష్ బాబు గారికి మా పార్వతి చెబుతుంది. పార్వతిని నీతో పాటు తీసుకువెళ్లి, అక్కడ నీ ఇంట్లో పని మనిషిని గానో, మరెక్కడనో ఉపాధి చూపించు. నన్ను ఈ పుణ్యస్థలిలో... ఈ పుణ్యాత్ముని చేతుల మీదుగా పోనీయండి.... నా కదే చాలు" అన్నాడు.

తరువాత అందరూ ఎంత బ్రతిమిలాడినా శంకరం వారితో వెళ్ళలేదు.

అయితే అదే రోజు తెల్లవారు జాము మూడు, నాలుగు గంటలకు  పార్వతి ఏడుస్తున్న శబ్దం విని గాబరాగా లేచాడు భద్రయ్య.

శంకరం చనిపోయాడు!

అతని దేహం అక్కడ డిశ్చార్జ్ అయింది!! అతని దేహంలో  ప్రాణం ఏ అనంత లోకాలకో తరలిపోయింది!!!

దాన్ని 'నిష్క్రమణం' అంటారో, 'మహాభి నిష్క్రమణం' అంటారో  అతనికి  తెలియదు.

★★★

COMMENTS